# ఎదురు చూడని దేవుడు

దమయంతి




ఆకాశానికి నిప్పుగానీ అంటుకుందా అన్నట్టుగా కొన్ని క్షణాలపాటు కళ్ళు పోయేలా బాకులా తళతళ మెరిసిందో మెరుపు. దాని వెనకే ఆకాశానికి గుండె బద్ధలైపోయేట్టుగా సింహగర్జన చేసిందో ఉరుము.

సుడిగాలి ప్రారంభమైంది. రోడ్డుపైన దుమ్ము చక్రాల్లా లేస్తోంది. విసురుగా మొదలైన బలమైన గాలి వర్షం వచ్చే సూచనల నందిస్తున్నట్టుగా చల్లగా మారింది. చెట్లు వాయుదేవుడి కోపాన్ని తట్టుకోలేక పోతున్నాయి.

వాతావరణం అల్లకల్లోలంగా ఉంది.

ప్లాటుఫారంమీద చివరగా ఉన్న ఓ బల్లపైన గువ్వలా ముడుచుకొని కూర్చుంది అరవింద. ఆమె పక్కగా ఓ ఎయిర్ బ్యాగ్ ఉంది. ప్లాటుఫారం చాలా భాగం చీకటిగా ఉంది. స్టేషను

మాస్టర్ గది దగ్గర ఒకటీ, ఆ చివరగా మరొకటీ గుడ్డి దీపాలు వెలుగుతున్నాయి

అరవింద ముందుకు జరిగి కూర్చుంది. పక్కకి తిరిగి చేతిగడియారంలో టైము చూసింది.

పదిన్నర.

ప్లాటుఫారం చివరివరకూ, ఆ తర్వాత చీకట్లో కనిపించినంత మేరా దృష్టిని సారించి చూసింది.

సారధి వస్తున్న జాడలేదు.

ఎందుకు రాలేదు సారధి?

బ్యాగ్‌ని దగ్గరకు లాక్కుని దూరంగా చూస్తూ కూర్చుంది అరవింద.

రైలుస్టేషన్ ఊరికి చివరగా ఉంది. అక్కడ సాధారణంగా ఎక్కే జనం తక్కువ. ఆ సమయంలో వెళ్ళే జనం అసలే ఉండని కారణంగా స్టేషన్ దాదాపు ఖాళీగా బిక్కుబిక్కు మంటూ ఉంది. ఎక్కే జనం ఉండరు కాబట్టి ఎక్స్‌ప్రెస్ బళ్ళేమీ ఆగవు. పాసింజర్లు మాత్రం అప్పుడప్పుడూ పలకరించి పోతుంటాయి.

అరవింద అక్కడికొచ్చినప్పుడు ప్లాటుఫారం ఖాళీగా వుంది. ఇప్పుడూ అలాగే వుంది.

పక్కనే అలికిడైంది.

సారథేనా?

గిరుక్కున తల త్రిప్పి చూసింది అరవింద. ఎవరూ లేరు.

ఎంతసేపు ఈ ఎదురు చూపులు? సారధి ఎప్పుడూ ఇంతే. ప్రతిదానికీ ఊరించటం, మనిషిని యాంక్జైటీలో పెట్టడం. ఉడుక్కుంటే పొంగిపోవటం సారధి అలవాటు. అది ఇలాంటి సమయంలోనా?

ఎదురుచూపులు కాదు, దొంగ టలు కాదు.

ఇది జీవిత సమస్య....

తలెత్తి చూసింది అరవింద.

ఏమీ కనిపించలేదు, చీకటి తప్ప. అసలు ఆకాశమంటూ ఏదీ లేదని అప్పుడే స్ఫురించింది అరవిందకి. మరి ఆకాశమంతెత్తు ఆశలమాటేమిటి?

"ఎల్లుండి రాత్రి పదిగంటలకి రైల్వే స్టేషన్లో ఎదురుచూస్తుంటాను వస్తావు కదూ?"

చివరిసారిగా రెండురోజుల క్రితం చెఱువు గట్టున కలుసుకొన్నప్పుడు సారధి అన్న మాటలవి.

తను మాట్లాడలేదు. భయంగా సారధి మొహంలోకి చూసింది.

"పలకవేం?" అడిగాడు.

"నాకేదో భయంగా ఉంది," అంది.

సారధి నవ్వేడు.

"భయం దేనికి? నేను లేనూ?" అన్నాడు.

"లోకం ఏమంటుంది?" బెరుగ్గానే అడిగింది.

సారధి గంభీరంగా మారేడు.

"లోకం సంగతి మన కనవసరం" అన్నాడు.

"కానీ మనసంగతి లోకానికి కావాలి".

సారధి తనకేసి సూటిగా చూశాడు.

"మనం చేసేపనిని జనం లేచిపోవడం అంటారు" అంది.

"దాన్ని మనం 'ఏకమవడం'అందాం." సారధి అన్నాడు.

తను పలుకలేదు. సారధికేసి ప్రోత్సాహకరంగా చూసింది.

"మీవాళ్ళేమంటారోనని భయమా?"

కాదన్నట్టు తలూపింది. నేలమీదికి చూస్తూ నిలబడిపోయింది. సారధి తన చుబుకం పట్టి పైకెత్తాడు. తన కళ్ళ ల్లోకి లోతుగా చూస్తూ "పిచ్చిదానా, నీకు నేను లేనూ" అన్నాడు.

అది చాలు. ఆ మాత్రం అండ తనకి చాలు. సారధికి ఆస్తి లేదు. అయితేనేం తన పట్ల అనురాగం ఉంది. ప్రేమ ఉంది. బ్రతగ్గల నేర్పుంది. అంతకు మించి ఇంకేం కావాలి తనకి.

సారధి గుండెలపైన వొదిగిపోయింది.

తనని గుండెలకేసి గట్టిగా అదుము కొని ధైర్యం చెబుతూ తన భుజం తట్టిన సారధి చేతి స్పర్శ తన ఒంటిపైన ఇంకా అలాగే ఉంది.

చలిగాలి ఎక్కువగా ఉంది. పవిట చెంగు తీసి వీపు చుట్టూతా కప్పుకొంది అరవింద.

పదకొండు కావస్తోంది.

ఎందుకు రాలేదు సారధి?

ఇంట్లోవాళ్ళంతా ఇంకా నిద్ర పోలేదేమో! లేక తనని ఎవరైనా పసిగట్టేరా? మరి తననెవరూ అడ్డు పడి ఆపలేదే?

ఒకవేళ సారధి మనసు మార్చు కున్నాడా?

అతను రాకపోతే....

ఆ ఆలోచన రాగానే చటుక్కున బెంచీపైన నిటారుగా అయింది అరవింద. గుండెల్లో కొత్త భయంచోటుచేసుకుంది. మనసులో కోటి అనుమానాలు తలెత్తాయి. మనిషిలో గుబులు బయలుదేరింది.

అవును సారధి రాకపోతే?!

ఎలా?

అరవింద కళ్ళు కత్తుల్లా మారాయి. చురుగ్గా సాగాయి. ఎదురుగా రైలు పట్టాలు చీకట్లో తళతళ మెరుస్తూ కనిపించాయి.

అవును, ఆ పనే చెయ్యాలి అంతే!

అరవింద బల్లపైనుంచి లేచింది. మెల్లగా నడుస్తూ ముందుకి వెళ్ళి ప్లాటు ఫారం అంచున నుంచుంది.

ప్లాటుఫారంమీద రాబోయే రైలెక్కడానికిగానూ తానొక్కతే నుంచుంది. ఇంకెవ్వరూ లేరు.

రైలుకట్ట పక్కగా పెరిగిన గడ్డి మొక్కలు, దూరంగా పొలాల్లో నిటారుగా పెరిగిన తాటిచెట్లు, చెవులు చిల్లులు పడేలా కీచురాళ్ళ మోత ఒంటరి

తనాన్ని గుర్తుకుతెస్తున్నాయి. భయాన్ని పెంచుతున్నాయి.

"సారధి అలాంటివాడు కాదు. తప్పకుండా వస్తాడు. ఏదో జరిగి ఉంటుంది. అందుకే ఆలస్యమై ఉంటుంది."

తనకి ధైర్యాన్నిచ్చింది సారధి. అసలు ఈ ఆలోచనకి కారణం సారధే. అతనే లేకపోతే ఏమైపోయేది తను? జీవితాన్ని గాలికి వదిలేసి జరిగేది చూస్తూ ఉండటమా?

జీవితం పట్ల ఆశలు పెంచాడు సారధి. జీవితం అంటే ఏమిటో తెలియ జెప్పాడు సారధి. కళ్ళుమూసుకుంటేనూ, కళ్ల తెరచి జరిగేది చూస్తూ కూర్చుంటేనూ, తెల్లవారిపోయేది కాదు జీవితం.

సారధి కోసం ఎదురుచూస్తున్న ఈ నిముషంలో ప్రతిక్షణం ఓ యుగంలా గడుస్తోందే, మరి అలాంటప్పుడు ఎన్ని యుగాలు కలిస్తే ఈ జీవితం?

జీవితం పట్ల నిర్లక్ష్యం పనికిరాదు. మనసుని చంపుకుని బ్రతకలేదు. అందుకే తనేమైనా చేస్తుంది. ఫలితమే సారధితో కలసి ఈ ప్రయాణం.

ఎక్కడికి?

తెలీదు!

ఎందుకు?

బతకడానికి!

ఎలా?

ఏమో....!

అవన్నీ సెకండరీ. మొదట సారధీ, తనూ- అంతే!

సారధితో కలిసిన జీవితం ఊహకి అందడంలేదు. అనుకున్న సమయానికి తను రాదేమోనని సారధి భయం. తన చేతిని గట్టిగా పట్టుకొని మళ్ళీ అడిగాడు-

"తప్పకుండా వస్తావు కదూ?"

తను తలూపింది.

"అలా కాదు నోటితో చెప్పు"

"వస్తాను," అంది. ఆ మూడక్షరాలు అన్నప్పుడు మూడుకోట్ల ఆలోచనలు మనసులో చోటు చేసుకున్నాయి. వాటి నన్నిటిని పక్కకి నెట్టేసి అంది.

సారధి కళ్ళు మెరిసాయి.

"సరిగ్గా పది గంటలకి," అన్నాడు.

"అలాగే."

"ఎదురు చూస్తుంటాను."


"ఆ అవకాశాన్నివ్వను."

సారధి మొదటిసారిగా ఆశ్చర్య పోయినా ఆ తర్వాత నవ్వేశాడు.

"గుడ్" అన్నాడు.

ఆ తర్వాత రెండు రోజులూ అవే ఆలోచనలు. తప్పు చేస్తున్నానేమేమో అన్న సందేహం మనసుని తొలిచేస్తుంటే ఎలాగా అన్న భయం- నలభై ఎనిమిది గంటలు ఎప్పుడెప్పుడుగడుస్తాయా అన్న ఆరాటం. తను చేస్తున్నది తప్పు ఎంత మాత్రం కాదన్న నిర్ణయానికి రావడానికి తనకెంతోసేపు పట్టలేదు.

సారధి తనకోసం చూస్తానన్నాడు



కానీ తనే అతని కోసం ఎదురు చూస్తోంది.

జీవితంలో చాలావాటికోసం ఎదురు చూపులు చూసింది. కానీ దేన్నీ అందుకోలేకపోయింది. అది తన దురదృష్టం.

మనుషులపైన నమ్మకం పోయి, మనిషి అంటేనే అసహ్యం కలిగే రోజుల్లో సారథి తటస్థపడ్డాడు!

"నీ కోసం నేనున్నాను!" అన్నాడు.

అప్పుడనిపించింది మనుషులంతా ఒకేలా ఉండరని, ఉంటే సమస్యలే ఉండవనీ. మనుషుల్లో తనూహించని రకంగా సారథి కనిపించేడు.

"నేనంటే నీకెందుకిష్టం?' అని అడిగిందోసారి.

"ఏమో తెలీదు" అన్నాడు సారథి.

"నేను అందంగా ఉంటాననా?"

సారథి సూటిగా చూశాడా మాటకి. ఆ చూపుల శక్తికి తట్టుకోలేక తలొంచుకుంది.

"రేపు ఈ అందం నీకు లేకపోయినా, నా ప్రేమ నీ కెప్పుడూ ఉంటుంది అరవిందా" అన్నాడు.

అంతే, సారథిపట్ల తనకున్న అనుమానాలన్నీపటాపంచలై పోయాయి.

విసురుగా వీస్తున్న ఈదురుగాలి చల్లగా మారి సన్నగా వీస్తుంది. చీకటి, దానికి తోడు గాలి చేస్తున్న చప్పుడు. సన్నగా చినుకులు ప్రారంభమై వాతావరణం ఆందోళన కలిగిస్తోంది.

సారథి పక్కనుంటే ఇవేవీ పట్టించుకునేదికాదు. కానీ సారథి రాలేదు.

ప్లాటుఫారం చివరివరకూ ఓసారి చూసి వచ్చి తిరిగి బెంచీపైన కూర్చుంది అరవింద.

పదకొండుదాటిందెప్పుడో. పన్నెండు గంటలకి పాసింజరు బండీ వుందని చెప్పాడు సారథి. అది రావడానికి ఇంకా చాలా టైముంది. ఈ లోపల సారథి ఎప్పుడైనా రావచ్చు. కానీ ఈ పరిస్థితిలో ఒంటరిగా సారథి కోసం ఇలా ఎదురుచూట్టం చాలా కష్టంగా తోచింది అరవిందకి. సారథి త్వరగా వస్తే బాగుణ్ణు. ఇంకో గంటలో సారథితో కలిసి ఈ ఊరికి, మనుషులకి దూరంగా ఎక్కడికో....

ఆడపిల్లని చూస్తే చాలు ఈ వెధవ దేశంలో పదేళ్ళ కుర్రాడినుంచీ పళ్ళు రాలిన ముసలాడికూ్కడా పాటలొస్తాయి. నోట్లో నీళ్ళూరతాయి. షోకులొస్తాయి. నోటికి అడ్డమైన వాగుడు వస్తుంది.

గుడికి వెళ్ళినప్పుడల్లా పూజారి రామాచారి తనని చూసి గుటకలు మింగడం తనకితెలుసు. వాడినిచూసిదేవుడ్ని చూస్తే దేవుడంటేనే అసహ్యం పుడుతుంది.

"ఏవని దణ్ణం పెట్టుకున్నావే పిల్లా?"

ఓ శనివారం సాయంకాలం గుడికి వెళ్ళినప్పుడు అడిగాడు రామాచారి. తను సమాధానం చెప్పకుండా మెట్లు దిగుతోంది.

వెనకే వచ్చాడు.

"నిన్నే."

వెనక్కి తిరిగి చూసింది.

"చెబితే మనసులోకోరికలు తీరవట" అంది.

పై వరసలో ఉన్న రెండు పళ్ళూ కనిపించేలా ఫెళ్ళున నవ్వేడు రామాచారి.

"ఓ యబ్బో, అసలు ఏం వరం కోరుకున్నావో చెబుదూ." అన్నాడు.

"మంచి మొగుడు రావాలనీ" అంది వాళ్ళమండి.

"ఆ మాత్రం వరాలు దేవుడ్ని అడగాలటే పిల్లా, ఎదురుగా నేను లేనూ?" చెయ్యి పట్టుకొంటూ అన్నాడు.

"ఛీ" విదిలించి కొట్టింది.

"మారాం చెయ్యక అలా గుడి వెనక్కి రా. పూజారితో విషయం మొదలైతే పుణ్యంకూడానూ."

నడుంమీద చెయ్యేసి దగ్గరకి లాక్కోబోయాడు.

"నీ పుణ్యం నువ్వూ తగలడ, దరిద్రుడా. సిగ్గులేదూ, పైగా పూజారివి."

విసురుగా వెనక్కి ఓ తోపు తోసి గబగబా మెట్లుదిగి వచ్చేసింది.

ఆ రోజునుంచీ గుడికి వెళ్ళడం మానుకుంది. దేవుడంటే నమ్మకం లేక కాదు. ఆ దేవుడున్నచోట రక్షణలేక భయమేసి మానేసింది.

ఆ వూరి ప్రెసిడెంటు కొడుకు రమేషు తనంటే పడిచస్తాడని తెలుసు. పట్నంనించి స్నేహితులొచ్చారు రాత్రికి రమ్మని ఓసారి చాటుగా కబురంపాడు.

పెళ్ళయి పెళ్ళాం పిల్లలున్న ఆ వూరి డాక్టరు తనని చూస్తే చాలు హిస్టీరియా వచ్చినవాడిలా మెలికలు తిరిగిపోతాడు.

ఊళ్ళో జనం అందరి గుండెల్లోనూ తనే నిద్రపోతోందట. ఇంతమందిని ఏడిపించడం అన్యాయమట. అందరినీ సంతృప్తిపరచడం ధర్మమట. గూడెం లీడరుగా చలామణీ అవుతున్న అంజయ్య వాగుడది.

ఛీ, ఏం మనుషులు? మనిషికి కేవలం కోరిక తప్ప వావి వరసలు, ఇహ పరాలు ఇవేవీ అక్కర్లేదా అనిపించింది. ఆ మనుషులన్నా చివరికి ఆ పరిసరాలన్నా రోత పుట్టింది ఆ వూరంటేనే అసహ్యం వేసింది.

మరి కాసేపటికి ఈ సమస్యల నన్నిటిని అధిగమించి, మనిషిని మనిషిగా చూసే అర్హతలేని ఆ మనుషుల మధ్య నించి తను కోరుకున్న వ్యక్తితో ప్రేమని తోడుగా తీసుకుని వెళ్ళిపోతుంది. అలా అనుకోగానే అరవిందకి గుండెలు తేలికై గాలిలో తేలుతున్నట్లుగా అనిపించింది.

గాలి విసురు తగ్గింది. సన్నగా ప్రారంభమైన చినుకులు పెద్దవైనాయి. ఆకాశం మరింత నలుపైంది. మధ్య మధ్య మెరుపులు, ఉరుములు, వర్షపు చినుకులు నేలపైన పడుతున్న శబ్దం— వాతావరణం భయంకరంగా మారిపోయింది.

సారథి రాలేదు. రాడేమో ....

అలా అనుకొన్న మరుక్షణంలోనే అరవింద కళ్ళల్లోకి నీరు ఉప్పెనలా పొంగింది.

సారథిని నమ్మి వచ్చింది తను. సారథి రాకపోతే....?

ఇలాంటి విషమపరిస్థితి ఎదురవుతుందని అరవింద ఊహించలేదు. సారథితో కలిసిన తన జీవితం ఎలా ఉంటుందో రంగుల్లో ఊహించుకొందే గానీ సారథి రాకపోతే ఏం చేయాలో ఆలోచించలేదింతవరకూ.

'ఏయ్' ఎవరో పిలిచారు.

ఉలిక్కిపడి తలెత్తి చూసింది.

ఎదురుగా ఆరడుగుల శాల్తీ ఆకలితో తినేసేలా చూస్తున్నాడు. చలితోపాటు ఇప్పుడా ఆగంతకుడ్ని చూసి గజగజ వణికిపోయింది అరవింద. కంగారుగా లేచి నించుంది. బ్యాగ్‌ని చేత్తో గట్టిగా పట్టుకొంది.

"వస్తావా పోదాం."

వాడన్న మాటల్ని విని నిలువునా కంపించిపోయింది. సారావాసన గుప్పు మంటోంది

"నేను.... నేను...." అంది తడ బడుతూ.

"భయం ఏమీలేదు. ఇద్దరం ఉంటాం. పైసలు బాగానే ఇస్తాం" వాడు నోటి కొచ్చినట్టు వాగుతోంటే చెవులొచ్చి వినబడ్డం మానేస్తే బాగుండనిపించింది అరవిందకి

"పద" చెయ్యి పట్టుకుని గుంజు తున్నాడు.

"ఏమిటీ దౌర్జన్యం?" అరిచింది అరవింద.

"బేరం దొరికినందుకు సంతోషించక అరుస్తావేమే? వేషాలు మానేసి పద."

అరవిందకి తనెంత ప్రమాదకరమైన స్థితిలో చిక్కుకోబోతోందీ అర్థం అయింది. బలాన్నంతా కూడదీసుకుని బ్యాగ్‌తో సహా ఏ. యస్. యం. గదిలోకి పరుగెత్తింది లోపలికి అడుగుపెడు తూనే తన వెనకే గది తలుపులు మూసి దారి కడ్డంగా నుంచుంది.

అంత చలిలోనూ అరవిందకి చెమ టలు పట్టాయి. తుఫాను గాలికి అల్లాడి పోయే ఆకులా శరీరం కంపిస్తోంది. గుండెల్లో దడ. ఆయాసంతో రొప్పు తోంది.

స్టేషన్ మాస్టరు అటుతిరిగి కూర్చుని రాసుకుంటున్నాడు. అతనికి అరవిందని గమనించే అవకాశం లేదు. పరుగెత్తు కుని అతని గదిలోకైతే వచ్చిందిగాని స్టేషన్ మాస్టర్ ఎవరన్న సంగతి ఆలో చించలేదు అరవింద. తీరా అతను తమ ఊరివాడైతే, ఏం సమాధానం చెప్పాలి? పరువు బజారుకెక్కుతుంది. జరిగిన పరాభవం చాలు.

వెనక్కో అడుగేసింది అరవింద. కానీ వెనుదిరిగిపోయే పరిస్థితి కాదు తనది. ఎక్కడికి వెళుతుంది?

స్టేషన్ మాస్టర్ కుర్చీలోంచి లేచి వెనక్కి తిరిగాడు.

గుమ్మం దగ్గర వణికిపోతూ అరవింద!

అరవింద చూసిందతన్ని. కంగారు పడింది. అతను గుడి పక్కసందులో స్కూలుకి వెళ్లేదారిలో ఉంటాడు. చిన్న ప్పుడు రోజూ స్కూలుకి వెళుతూ చూసేదతన్ని. అరవిందకి భయంతో గుండెలు జారిపోతున్నాయి.

"ఎవరు?" అడిగాడతను.

అరవింద తేలిగ్గా గాలి పీల్చుకొంది. అయితే తనని గుర్తుపట్టలేదన్నమాట. చిన్నప్పుడెప్పుడో చూసి ఉంటాడు. గుర్తుండి ఉండదు. ఇదీ ఒకందుకు మంచిదే! కాని ఏమిటి చెప్పడం?

"ఏం కావాలి?"

అరవిందని ఆపాదమస్తకం చూస్తూ దగ్గరగా వచ్చి అడిగాడు. అతనికి దెయ్యాలంటే చచ్చే భయం. దానికి తోడు

ఆ ప్రాంతాల దెయ్యాలు తిరుగుతుంటాయని చెప్పుకొంటారు. అర్ధరాత్రి ఆడపిల్ల నొక్కదాన్ని చూసేసరికి అతనికి కంగారెక్కువైంది. వెంటనే పాదాల్ని చూసాడు. మామూలుగానే ఉండటం గమనించి స్థిమితపడ్డాడు. కానీ పరిస్థితి మాత్రం అర్థంకాలేదు.

"ఏమిటమ్మాయ్, ఏం జరిగింది?" అనుమానంగా అడిగాడు.

అతనలా అడగటం చూసిన అరవిందకి భయంతో నోట మాట రాక, ఏం చెప్పాలో తెలీక తికమకపడి చూస్తూ నిలబడి పోయింది.

"నేను.... నేను...." అంది గొంతు తడారిపోతుండగా.

స్టేషన్ మాష్టర్ అరవిందకేసి చూసాడు.

ఎడంచేతి భుజానికి తగిలించి ఉన్న ఎయిర్‌బ్యాగ్‌ని గట్టిగా పట్టుకొనిఉంది. చీర కొద్దిగా నలిగి ఉంది. జుట్టు రేగి మొహంపైన పడుతోంది. పరుగెత్తుకు వచ్చిందేమో, కుడిచేత్తో, చీరకుచ్చెళ్ళు కొద్దిగా పైకెత్తి పట్టుకున్న చెయ్యి అలాగే ఉంది.

అరవిందని ఆ స్థితిలో చూసిన స్టేషన్ మాస్టర్‌కి సదభిప్రాయం కలగలేదు.

"ఏమిటి?"అన్నాడు ఈసారిగట్టిగానే.

"నేను.... నాకు...." ఆమె మాట పూర్తికాకుండానే తలుపు తోసుకుని ఓ వ్యక్తి లోపలికొచ్చాడు. అరవిందని చూసిన అతని కళ్ళలో క్షణకాలంపాటు ఆశ్చర్యం తొణికిసలాడింది.

"సారీ సర్. రౌడీ మూక ఏదో అల్లరి పెడుతుంటేనూ ఈ మెనిటు మీ గదికి పంపి డిస్టర్బెన్స్" అని అరవిందకేసి తిరిగాడా వ్యక్తి.

అరవింద కళ్ళు వెడల్పు చేసుకుని చూస్తోంది ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. ఓ నిముషం క్రితం వరకూ ఒక పరిస్థితి. ఇప్పుడు మరో పరిస్థితి.

ఎవరితను?

అతనికేసి పరీక్షగా చూసింది మనిషి ఆరడుగుల ఎత్తుంటాడు. ఆకర్షణీయమైన కళ్ళు, బ్రౌన్ కలర్ బెల్‌బాటమ్, అదే రంగు షూ, ఫుల్ హాండ్స్ షర్టు వేసుకున్నాడు. వర్షంలో తడిసిన ఉంగరాల జుట్టు మొహంమీద పడుతోంది. మనిషి సభ్యత తెలిసినవాడిలా, గంభీరంగా ఉన్నాడు.

ఎవరితను? మరోసారి ప్రశ్నించుకుంది అరవింద. ఆ వెంటనే

'ఎవరైతేనేం సమయానికి దేవుడిలా వచ్చి రక్షించాడు' అనికూడా అనుకొంది.

అతను అరవిందకేసి తిరిగాడు దగ్గరగా వస్తూ.

"పద అరవిందా" అన్నాడు.

అదిరిపడింది అరవింద. ఇతనికి తన పేరెలా తెలుసు?

స్టేషన్ మాస్టర్ ఆశ్చర్యంగా చూస్తు

న్నాడు ఇద్దర్నీ. అది గమనించిన అరవింద మౌనంగా అతనితోపాటు బయటికి నడిచింది.

"సారీ ఫర్ ది ట్రబుల్." గది బయటికి నడుస్తూ మరోసారి స్టేషన్‌మాస్టర్ కేసి తిరిగి అన్నాడతను.

"ఇక్కడ ఇలాంటివి మామూలే. జాగ్రత్తగా ఉండాలి ఆడవాళ్ళతో వెళుతున్నప్పుడు" అన్నాడు స్టేషన్ మాస్టర్ తిరిగి రాసుకుంటూ.

"పన్నెండు గంటల ప్యాసింజర్ రైట్ టైంకే వస్తోందా?" అడుగుతున్న అతని మొహంలోకి మరింత ఆశ్చర్యంగా చూసింది అరవింద.

"ఈ రోజు మీ పుణ్యమా అని రైట్ టైంకే వస్తోంది అన్చెప్పి—

"అవొస్తే కానీ నేనింటికి పోవడానికి వీల్లేదు." గొణుక్కుంటున్నట్టుగా అన్నాడు స్టేషన్ మాస్టర్.

"ఓ. కె. థాంక్యూ." గది బయటికి నడిచాడతను.

మవునంగా అతన్ననుసరించి

"థాంక్స్" అంది అరవింద.

"ఎందుకూ?" అడిగాడతను నడుస్తూనే.

"సమయానికి నన్ను రక్షించినందుకు."

"ఎవరినుంచి? రౌడీల బారినుంచా లేక ఆ స్టేషన్ మాస్టర్ బారినుంచా?"

"అంటే...."

ఇందాక అరవింద కూర్చున్న బెంచీ పైన కూర్చున్నాడతను. అరవిందని కూర్చోమన్నాడు. తటపటాయిస్తూ ఎయిర్ బ్యాగ్ ఇద్దరిమధ్యా పెట్టి అదే బెంచీపైన కూర్చుంది అరవింద.

"అవును. నేను దూరంనుంచి వస్తూ రౌడీలు ఎవర్నో అల్లరిపెట్టడం గమనించాను. నేను వచ్చేసరికి ఓ ఆడపిల్ల ఏ. ఎస్. ఎం. గదిలో దూరడం జరిగిపోయింది. వాళ్ళని తన్ని ఇటొచ్చి చూస్తే ఏముందీ.... ఇదీ పరిస్థితి. ఎవరో అనుకున్నాను. కానీ ఇప్పుడా ఆడపిల్లెవరో తెలిసిపోయింది."

"ఎవరు?" అంది అరవింద.

"నువ్వే!"

"అరవింద ఉలిక్కిపడింది. ఓ అపరిచిత వ్యక్తిని పట్టుకుని 'నువ్వే' అంటాడే? ఇంతకు ముందు అరవింద అన్నాడు. ఇప్పుడు నువ్వంటున్నాడు.

"ఎవరీ మనిషి?"

"అయిపోయాయా ప్రశ్నలన్నీ?" అడిగాడతను నవ్వుతూ.

"అబ్బే నేనేమీ అడగందే...." తడబడింది.

"బయటికి కాదు. లోలోపల నువ్వు వేసుకుంటున్న ప్రశ్నలు."

"మళ్ళీ నువ్వంటాడే!" అరవింద ఆలోచనలో పడింది.

"వీడెవడు ప్రశ్నలతో చంపుకుతింటున్నాడని తిట్టుకొంటున్నావా?"

'ఖర్మ ఇతనికి మనుషుల ఆలోచనలు చదవడం తెలుసులా ఉంది!' అనుకొని పైకిమాత్రం "ఉహుం మంచి కంపెనీ ఇస్తున్నారనుకొంటున్నాను" అంది.

వర్షం కురుస్తూనే ఉంది.

టైం చూసింది అరవింద.

పదకొండున్నర.

ఏమిటిది? ఏం జరగబోతోంది? ఏమైపోతుంది తను!

బండికి ఇంకా అరగంట టైముంది. సారథి ఎప్పుడు వస్తాడో? అప్పటి వరకూ ఎలా? ఆఖరి నిముషంలో వచ్చి ఆశ్చర్యపరుద్దామనుకొని ఉంటాడు. వచ్చిన తరువాత చెప్పాలి ఇక్కడ ఒంటరిగా తనెన్ని అవస్థలుపడిందీ.

రౌడీల బారినుంచి తప్పించుకొన్నా ననుకుంటే ఇప్పుడితను। అన్నీ తెలిసి నట్టు మాట్లాడుతున్నాడు. ఎవరీ మనిషి? ఎలాంటివాడు? తనతో ఎలాంటి పరి చయం?

"అరవిందా...." పిలిచాడతను.

తలతిప్పి చూసి "నా పేరెలా తెలుసు?" అడిగింది.

"బాగుంది. ఆడపిల్లల పేర్లు కాక పోతే మగపిల్లల పేర్లు పెట్టుకుంటారా?" అన్నాడతను నవ్వుతూ.

అరవిందకి మళ్ళీ భయం పట్టుకుంది. ఇతనెవరో తనను వెంటాడుతున్నాడు. ఇప్పుడేమిటి దారి?

అరవింద మాట్లాడకపోవడం చూసి అన్నాడతను.

"నేను నువ్వనుకుంటున్నంత చెడ్డ వాడ్నేమీకాదు. నావల్ల నీకే ప్రమాదమూ జరగదని హామీ ఇస్తున్నాను. సరేనా?"

అరవింద నమ్మలేనట్లుగా చూసింది. భయం పూర్తిగా పోలేదు.

"నా పేరెలా తెలుసు?" మళ్ళీ అడిగింది.

"తెలుసు."

"నేను మీకు ముందే తెలుసా?"

"తెలుసు."

"ఎలా?"

"చెప్తాను" అన్నాడే కానీ అతనేమీ మాట్లాడలేదు.

"నా గురించి మీకేం తెలుసు?" అడి గింది.

"చాలా తెలుసు."

"ఏమిటి?"

"అన్నీ చెప్తాను. ముందిది చెప్పు. ఈ వేళప్పుడిక్కడేం చేస్తున్నావు?" అర విందనీ ఆమె చేతిలోని ఎయిర్‌బ్యాగ్‌ని మార్చి మార్చి చూస్తూ అడిగాడతను.

అరవింద సమాధానం చెప్పకుండా ఎటో చూస్తూ కూర్చుంది.

సారథి వచ్చేస్తే బాగుణ్ణు. ఈసమస్య లన్నిటికీ ఒకేసారి పరిష్కారం దొరుకు తుంది.

"చెప్పు అరవిందా, అర్ధరాత్రి ఒంట రిగా నీ కిక్కడేం పని?"

అప్పటికీ అరవింద సమాధానం చెప్ప లేదు. కాలువలుకట్టి పారుతున్నవర్షపు

నీటికేసి చూస్తూ కూర్చుంది.

"నేను నీ శ్రేయోభిలాషిని. నావల్ల నీకు మేలుతప్ప కీడు జరుగదు. నాతో చెప్పు. ఎక్కడికి వెళుతున్నావు?"

"ఊరు." మెల్లగా చెప్పింది.

"ఏ ఊరు?"

"........"

"ఎవరితో?"

"........"

"ఒంటరిగా వెళ్తున్నావా?"

"కాదు."

"మరి?"

అరవింద సూటిగా అతని మొహం లోకి చూసి తలదించుకొంది.

"మా వాళ్ళొస్తారు" అంది.

"ఎవరు?"

"........"

అతను బలంగా గాలిపీల్చి వదిలాడు. ఆమెకేసి నిశ్చలంగా చూస్తూ...."నీదారికి అడ్డురాను. నాతో చెప్పు. ఎవరాఅదృష్ట వంతుడు?"

"వచ్చినప్పుడు చూపిస్తాను." నెమ్మదిగా అంది.

అతను అలసటగా బెంచీపైన వెనక్కి వాలాడు. తలెత్తి ఆకాశంకేసి చూశాడు. ఏమీ కనిపించలేదు. ఈ ఉరుములు, మెరుపులు, పెద్దగా శబ్దంచేస్తూ, ఈ కుంభవృష్టి ఇవన్నీ ఎక్కడినుంచి? తల విదిలించి అరవిందకేసి తిరిగి —

"చాలా సంతోషం రవీ! కనీసం నువ్వైనా సుఖపడు" అన్నాడు.

ఉలిక్కిపడింది అరవింద. 'రవీ!' ఆ పేరుతో తనని ఒకే ఒక్కరు పిలిచినట్టు గుర్తు. కానీ ఎవరా మనిషి? జ్ఞాపకం రావటంలేదు. అతనంటున్న మాటలు నీరసంగా వినబడుతున్నాయి అరవింద చెవులకి.

"మీరు...."

"ఎవరని కదూ నీ అనుమానం?" అడిగాడు.

తలూపింది అవునన్నట్టుగా.

"నాది మీ ఊరే."

"మా ఊరా!" అదిరిపాటుని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నంచేస్తూ అంది.

"అవును."

"అయితే పేరేమిటి? ఎవరితాలూకు? ఎక్కడుంటారు? ఇంతకు ముందెప్పుడూ చూడలేదే? ఇప్పుడు వెళ్ళి ఊరందరికీ తనగురించి చాటుతాడా?" ఇవన్నీ అరవింద మనసులో తలెత్తిన ప్రశ్నలు.

"పేరు?" అడిగింది.


"నీకు తెలీదులే" అన్నాడతను.

"తెలీకేగదా అడిగేది!"

"పేరు చెప్పినా నీకు తెలీదు."

"పేర్లు తెలిసిన వాళ్ళంతా మనుషులు తెలియాలనేముంది?"

"నిజమే అరవిందా. పేరు తెలిసినంత మాత్రంచేత మనిషి తెలియాలని రూలేమీలేదు. కానీ మనకి కావాలనుకొన్న మనిషి మనకి తెలియకపోయినా, పేరు తెలిస్తే కనీసం ఊహలోనైనా



ఆనందించవచ్చు. ఎంతకాలమైనా జ్ఞాపకం పెట్టుకోవచ్చు."

ఆగి అరవింద మొహంలోకిచూశాడు. ఆ తర్వాత అన్నాడు.

"నా పేరు కృష్ణ."

అరవింద ఉలిక్కిపడింది. ఏవో జ్ఞాపకాలు....చిన్ననాటి సంఘటనలు.... కృష్ణ....ఆ పేరుతోతనకిబాగా పరిచయం కానీ మనిషి....?"

"ఏ కృష్ణ?" అడిగింది.

"జామకాయల దొంగ కృష్ణ...." చెప్పాడు.

చివ్వున తలెత్తి చూసింది అరవింద.

"మాస్టార్లని ఏడిపించే అల్లరబ్బాయి కృష్ణ...."

అరవింద కళ్ళు వెడల్పయినాయి.

"అరవింద దగ్గర పాఠాలు నేర్చుకున్న మొద్దబ్బాయి కృష్ణ...."

అరవింద మనసులో తుపానురేగింది గతం తాలూకు నీడలు....

"ఆడపిల్లల్ని కొట్టి పారిపో యే రౌడీ—"

"ఇంక చాలు. కృష్ణా ఆపు" భరించ లేనట్లుగా చెవులు మూసుకుంటూ అరిచింది అరవింద. ఒక్క క్షణం కళ్ళు మూసుకొంది.

—కృష్ణకి కోపం ఎక్కువ. పట్టుదలకూడా ఎక్కువే. మరొకళ్ళతో పోల్చి తననెవరైనా తక్కువచేసి మాట్లాడితే ఊరుకోడు. తనకిష్టమైన వస్తువునుగాని తనది అనుకున్న దేన్నయినాసరే ఎవరైనా లాక్కుపోవడం సహించలేడు.

రోజూ జామకాయలు తన కిష్టమని దొంగతనంచేసి తీసుకొచ్చేవాడు కృష్ణ.

"నీకు జామకాయలంటే అంత ఇష్టమా?" ఓసారి అడిగాడు.

"అవును" చెప్పింది.

"నేనంటేకూడా నీకిష్టం కదూ?"

"అవును."

కృష్ణ కళ్ళు సంతోషంతో మెరిశాయి.

"ఎందుకు?" అడిగాడు ఆశగా.

"జామకాయలు తెచ్చిస్తావుగా. అందుకు.

కృష్ణ మొహంలో ఉత్సాహం మాయమైంది.

"జామకాయలు తేననుకో, అప్పుడూ?" అడిగాడు.

"అయినా ఇష్టమే" అంది.

కృష్ణకి ఏనుగెక్కినంత సంతోషం వేసింది.

"మరి నువ్వంటే కూడా నా కిష్టం" అన్నాడు.

"ఎందుకూ?" అడిగింది.

"నేను జామకాయలిస్తే నువ్వు ముద్దిస్తావుగా అందుకు."

అరవింద సిగ్గుతో లోపలికి పారిపోయింది.

ఓసారి వరసగా మూడురోజులు కృష్ణ కనబడలేదు. జామకాయలూ తేలేదు నాలుగోరోజు జామకాయలు తెచ్చి ఇవ్వబోతే,

"వద్దు" అంది అలిగి.

కృష్ణ ఆశ్చర్యంగా చూసాడు.

"ఎందుకని?"

"నా దగ్గర ఉన్నాయి."

"ఎక్కడివి?"

"రాజు ఇచ్చాడు."

కృష్ణ కోపంగా చూసాడు.

"స్కూల్‌కి వెళదాం రా" అన్నాడు.

"నేను రాను."

"అదేం?"

"నా ఇష్టం" లోపలికి వెళ్ళిపోయింది.

కృష్ణ ఒంటరిగా స్కూలుకి వెళ్ళిపోయాడు. ఉండబట్టలేక తర్వాత తనూ స్కూల్కికి వెళ్ళింది. కృష్ణ తనని తినేసేలా చూసాడు. ఇంటికి తిరిగొస్తుంటే దారిలో అడిగాడు.

"రానని చెప్పి వచ్చావేం?"

"ఇకనుంచీ నీతో రాను."

"ఎందుకని?"

"రాజుతో కలిసి వెళ్తాను."

కృష్ణ నడవడం ఆపి కళ్ళెర్రజేస్తూ "ఏమిటీ?" అన్నాడు.

"రోజూ రాజుతోనే ఆడుకుంటాను."

కృష్ణ చటుక్కున ముందుకి వచ్చి అరవింద రెండు జడలూ గట్టిగా పట్టుకున్నాడు. జడలు పట్టి ఊపేస్తూ—

"నువ్వు నాతోనే స్కూలుకి రావాలి" అన్నాడు.

"రాను."

"రావాలి." గట్టిగా అన్నాడు.

"రాను."

"రావూ?" జడలు వదిలేసి గభాల్న కిందకి వంగి పక్కనే పడున్న రాయి తీసి అరవిందకేసి బలంగా విసిరాడు కృష్ణ.

"అమ్మో" అంటూ పడిపోయిన అరవిందని రక్తం మడుగులో చూసిన కృష్ణకి భయంతో చెమటలు పోసాయి. నిలువునా వణికిపోతూ కింద పడున్న అరవిందని చూసాడు. తను అరవిందని కొట్టినట్టు తెలిస్తే బతకనివ్వరు. తవ్వి పాతలో పాతేస్తారు. పుస్తకాల సంచి అక్కడ పారేసి పరుగు లంకించు కున్నాడు, కృష్ణ. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు....ఇలా....

"ఏమిటాలోచిస్తున్నావ్? ఇంకా గుర్తు రాలేదా నేనెవరో?"

అరవింద తల తిప్పి అతనికేసి చూసింది.

"ఎలా వచ్చావిక్కడికి?"

"ఎందుకొచ్చావ్" అనడుగు తున్నట్టుగా వినబడింది కృష్ణకి. అదోలా నవ్వేడు. నవ్వి.....

"పిచ్చి ప్రశ్న," అన్నాడు.

'నిజమే. తన బుర్ర పనిచేయడం లేదు' అనుకొని మౌనంగా వర్షాన్ని చూస్తూ కూర్చుంది అరవింద. కాస్సేపటి తర్వాత మళ్ళీ తనే అడిగింది.

"నేనిక్కడ ఉన్నట్టు ఎలా తెలుసు?"

"తేలీదు." అన్నాడు కృష్ణ.

"మరి? .... ?"

"తెలిస్తే ఇంత ఆలస్యంగా వచ్చేవాడినికాదు. చాలా ముందే వచ్చేవాడిని?"

"ఎప్పుడొచ్చావు ఈ ఊరు?"

"సాయంత్రం."

"అప్పుడే వెళ్ళిపోతున్నావేం?"

"ఎవరున్నారు నాకిక్కడ?" అరవింద కేసి చూసాడు. అరవింద కళ్ళు దించుకొంది.

'మరెందుకొచ్చావ్' అనడగాలను కొని ఊరుకొంది.

"నాకీ ఊళ్ళో ఎవరూ లేరు. ఈ ఊరు నన్నెప్పుడో మర్చిపోయింది. కానీ ఈ ఊరునీ, ఈ ఊళ్ళో మనుషుల్నీ నేను మర్చిపోలేదు. మర్చిపోలేను. అందుకే సంవత్సరానికొక్కసారైనా

వచ్చిపోతుంటాను." కృష్ణ చెప్పాడు.

"ప్రతి సంవత్సరం ఈ ఊరు వస్తావా?" ఆశ్చర్యంగా అడిగింది అరవింద. "అవును ప్రతి సంవత్సరం ఆఖరిరోజు అంటే డిశంబరు ముప్పై ఒకటో తేదీ ఈ ఊరు వస్తాను.

"నా కెప్పుడూ కనబడలేదు...."

"నిజమే. ఎవరికీ కనబడను. కానీ నాకు కావల్సిన వాళ్ళను దూరంగా చూసి, దాంతో తృప్తిపడి వెళ్ళిపోతాను. కారణం, నా గురించి మీరేమనుకుంటు న్నారో నాకు తెలీదు. నేనెవరికీ గుర్తు లేను. కనపడి భంగపడటం నా కిష్టం లేదు."

"ఎవరు నీకు కావలసినవాళ్ళు?"

"నిజంగా నీకు తెలీకే అడుగుతున్నావా?"

అరవింద బదులు చెప్పలేదు.

"చెప్పవలసిన సమయం మించి పోయింది అరవిందా. ఇప్పుడు చెప్పి ప్రయోజనంలేదు రెండు మనసుల్ని వ్య కి గురిచేయడం తప్ప."

అరవిందకి కృష్ణ మాటలేవీ చెవి కెక్కడంలేదు. మనస తా సారథి పైన ఉంది. ఇంకా రాడేం సారథి?

"సాయంత్రం పాసింజర్‌లో దిగాను. చీకటిలోనే దూరంగా ఊరిని చూసాను. నాకు కావల్సినవాళ్ళనీ చూసాను. పన్నెండు గంటల పాసింజర్‌లో వెళ్ళిపోతున్నాను. అయితే ఈసారి ఎప్పటిలా ఆశని మోసుకు వెళ్ళలేకపోతున్నాను. ఈ ఊరితో ఇంక రుణం తీరిపోయిందనుకొని వెళ్ళుతున్నాను."

చెప్పడం ఆపి అరవింద మొహం లోకి చూసాడు కృష్ణ. అరవింద తన మాటలు వింటున్నదీ లేనిదీ తెలీలేదు. ఆమె మొహంలో ఏ భావమూ కనబడ లేదు ఒక్క ఆతృత తప్ప. అరవింద తనని కావాలనే దూరం చేసుకుంటోందా? అర్థం కాలేదు కృష్ణకి.

ఏమైనా ఇప్పుడు అరవింద మరో వ్యక్తి కోసం ఎదురుచూస్తోంది.

"మీ వాళ్ళింకా రాలేదా?" అరవింద పడే కంగారుని గమనించి అడిగాడు.

"వస్తారు" అంది.

ఆ గొంతులో నమ్మకం ధ్వనించింది. అతని మనసు తుఫానులో చిక్కుకున్న నావలా కొట్టుకుంటోంది తన వస్తువు నెవరో శాశ్వతంగా లాక్కుపోతున్నట్టు ఫీలయ్యాడు. అరవిందని అలా చూస్తూ ఇంక ఎంతోసేపు కూర్చోలేననిపించింది.

రైలు వస్తుంది. తననీ, అరవిందనీ కూడా తనతో తీసుకువెళుతుంది కానీ తను కోరుకున్నట్టుగా ఇద్దరినీ కలిపికాదు విడివిడిగా తీసుకువెళుతుంది. అలా అనుకోగానే కృష్ణకి గొంతులో ఏదో అడ్డుపడినట్లుగా బాధతో కంఠం పూడి పోగా మౌనంగా చీకట్లోకి చూస్తూ కూర్చున్నాడు.

—వర్షం సన్నగా పడుతోంది.

మెరుపు మెరిసినప్పుడల్లా రైలుకట్ట పొడుగునా కనిపించినంత మేరా ఆశగా చూస్తూనే వుంది అరవింద

టైం చూసింది. పదకొండూ నలభై అయిదు.

ఒక్కో నిముషం గడుస్తున్నకొద్దీ ఒక్కో సెంటీమీటరు గుండె దిగజారి పోతున్నట్టుగా వుంది. ఆత్రంగా దిక్కులు చూడటం ప్రారంభించింది. ప్లాటుఫారం చివరివరకూ చీకట్లో పిచ్చిగా చూస్తోంది.

రైలు రావడానికింకా పావుగంట టైముంది. సారధి ఇంకా రాలేదు ఏం జరిగింది? ఎందుకు రాలేదు. అలా అనుకోడం ఇది ఎన్నోసారో అరవిందకి గుర్తులేదు.

సారధి రాకపోతే ఏం చేయాలి?

వస్తాడు అనే ఆశతోనే రెండు గంటలూ ఎదురుచూసింది. ఈ క్షణం వరకూ సారధి వస్తే ఏం చేయాలో ఆలోచించింది. ఇప్పుడు రాకపోతే ఏం చేయాలన్న సమస్య పెద్ద భూతంలా ఆమెకి తెలీకుండానే మనసంతా ఆక్ర మించుకొంది.

మాటి మాటికీ చేతి గడియారంకేసి చూస్తోంది.

కృష్ణ అరవిందని గమనిస్తున్నాడు.

అరవింద ఇవేవీ గమనించే స్థితిలో లేదు.

'సారధి ఎందుకు రాలేదు?' అన్నదే ప్రశ్న.

క్షణక్షణానికి గుండె వేగం హెచ్చు తోంది. అంత వర్షంలోనూ చెమటతో అరచేతులు తడిసిపోతున్నాయి. ఎంత దాచుకోవాలని ప్రయత్నించినా మొహంలో కంగారు స్పష్టంగా కనిపి స్తూనేఉంది. అయోమయంగా చుట్టూ చూసింది. సారధి ఇంక రాడు! రాడు! రాడు అని వేయి గొంతులతో ఎవరో అరుస్తున్నట్టుగా వినిపించింది. భయంతో చెవులు గట్టిగా మూసుకొంది.

'వస్తాడు.' తనకి తెలియకుండానే గట్టిగా అరిచింది అరవింద.

"ఏమిటి? ఎవరు?" కృష్ణ కంగారుగా అడిగాడు.

చెయ్యి పట్టుకొని అతను కుదిపిన కుదుపుకి ఈ లోకంలోకి వచ్చింది. అతనికేసి పిచ్చిచూపులుచూస్తూ "ఏంలేదు" అంది.

కృష్ణ వెంటనే చెయ్యి వెనక్కి తీసుకొని "సారీ" అన్నాడు.

అరవింద వినిపించుకునే స్థితిలోలేదు. మనసులో తుఫాను రేగుతోంది. గుండెల్లో అగ్నిపర్వతాలు ఏ క్షణంలో నైనా బద్దలవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. బాధగా తలని మోకాళ్ళ మధ్య ఇరికించింది అరవింద.

"రవీ...." పిలిచాడు కృష్ణ.

"వద్దు నన్నలా పిలవొద్దు" మోకాళ్ళ మధ్యనించే అంది.

జాలిగా చూసాడు కృష్ణ.

దూరంగా అడుగుల శబ్దం! అటు తిరిగా రిద్దరూ.

చీకట్లోంచి నడచి వస్తున్న ఆకారం దగ్గరౌతోంది.

సారధి! అవును సారధే!

అరవింద లేచి నించుంది. ఆశగా ఆ మనిషి వస్తున్నవేపు చూసింది. లైటు వెలుగులో ఆ ఆకారాన్ని పోల్చుకుంది అరవింద.

వచ్చింది సారధి కాదు. వాళ్ళ యింటి నౌకరు.

సారధి ఎందుకు రాలేదు?

చొక్కా జేబులోంచి సగం తడిసిన చీటీని అరవిందకి అందించాడామనిషి. ఆత్రంగా అందుకుని వణుకుతున్న చేతులతో విప్పి చూసింది.

'అరవిందా, నన్ను క్షమించు. జీవితం పట్ల నీకు ధైర్యాన్ని నూరిపోసిన పిరికివాణ్ణి నేను. నలభై ఎనిమిది గంటలు ఆలోచించిన మీదట నేనీ నిర్ణయాని కొచ్చాను. అందరికీ, అన్నిటికీ దూరంగా పారిపోయి కేవలం ప్రేమ కోసం బ్రతగ్గల ధైర్యం నాకు లేదు. క్షమించు'— సారధి.

కొయ్యబారిపోయింది అరవింద. శిలలా నిలబడిపోయింది. మెదడు పని చేయడం మానేసింది.

చిత్రం!

తన కళ్ళవెంట నీళ్ళు రావడంలేదు. అదోరకం నవ్వు కదిలింది పెదవులపైన. కాగితాన్ని అలాగే చేత్తో పట్టుకు నుంచుంది. తన జీవితంలో ఆఖరి ఆశ కూడా తననీ విధంగా మోసం చేస్తుందనుకోలేదు. గతం తాలూకు మనుషులు, సంఘటనలు, సంభాషణలు క్షణకాలం పాటు కళ్ళముందు సినిమా రీలులా గిర్రున తిరిగాయి. కదిలి ఓ అడుగు ముందుకు వేసింది అరవింద. సారధి చేతి రాతతో ఉన్న కాగితం అతని ఉనికిని గుర్తుకు తెస్తూ కంపరం కలిగిస్తోంది. మనసులో త్రుటికాలం సారధి రూపం మెదిలింది.


"ఛీ!"

చేతిలో గుచ్చుకొంటున్న కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చేసి నలిపి రైలుపట్టాలమీదికి విసిరేసింది. రైలు పట్టాల మధ్య వర్షపు నీటిలో కొట్టుకు పోతున్న కాగితం ముక్కల్ని చూస్తూ "ఛీ" అని మరోసారి అప్రయత్నంగా అనుకొంది. అంతే. ఆ రెండక్షరాలతో సారధి తాలూకు ఆలోచనలు, జ్ఞాపకాలు అన్నీ కొట్టుకుపోయాయి.

"బాధపడుతున్నావా?" కృష్ణ దగ్గరగా వచ్చి అడిగాడు.

"లేదు ఆలోచిస్తున్నాను" అంది.

వర్షం పూర్తిగా తగ్గిపోయింది. ఆకాశపు నలుపు తగ్గింది. చల్లని గాలి వీస్తోంది. అప్పటివరకూ కురిసిన వర్షం తాలూకు నీరు కాలువగట్టి పారుతోంది. అరవింద పైకి చూసింది.




పన్నెండు కావడాని కింకా రెండు నిముషాల టైముంది.

సరిగ్గా పన్నెండు గంటలకి రైలు వస్తుంది. కృష్ణ ఎక్కుతాడు. సారథితో కలిపి తనను తీసుకువెడుతుందనుకున్న రైలు తనను ఒంటరిగా ప్లాటు ఫారంపైన వదిలేసి వెళ్ళిపోతుంది.

ఇంత జరిగిన తర్వాత వెనక్కి తిరిగి ఎలా వెళ్ళడం? అలా అని ఆ వచ్చే రైల్లోనూ ఎక్కలేదు.

ఎటు తన దారి?

ఏది తన గమ్యం?

దూరంగా రైలు కూతేసింది. రైలు వస్తుంది. ఆగుతుంది. వెళ్ళిపోతుంది.

"రవీ...." పిలిచాడు కృష్ణ.

వద్దు అనుకుంటూనే చూసిందతన్ని.

"ఒక్క మాటకి సమాధానం చెప్పు, వెళ్ళిపోతాను."

"ఏమిటి?" అడిగింది.

"నాతో రావడం నీకిష్టమేనా?"

అదిరిపడింది అరవింద. ఏమిటిది? తను వింటున్నది నిజమేనా?

"చెప్పు రవీ. అవుననో కాదనో ఒక్క మాట చెప్పు."

అరవింద పలకలేదు. ఏమిటిది? ఏం జరుగుతోంది? తను సారథిని ప్రేమించింది. అతనితో తన జీవితాన్ని వూహించుకొంది. కానీ కృష్ణ....

రైలు స్టేషన్లోకివచ్చి ఆగింది. రెండు నిముషాలు మించి రైలు ఆగదక్కడ.

"మాట్లాడు అరవిందా. ఇప్పుడు నీ నిర్ణయంమీద రెండు జీవితాలు ఆధార

పడి ఉన్నాయి. నువ్వు కోరుకున్న విధంగా సారథి నీకు దక్కితే నేను నీ జీవితాన్నించి దూరంగా వెళ్ళిపోయే వాడిని. కానీ అలా జరగలేదు. అందుకే అడుగుతున్నాను. నాకు మరొక్క అవకాశాన్ని ఇవ్వు అరవిందా."

అప్పటికీ అరవింద పలకలేదు. నేలమీదికి చూస్తూ నుంచుంది. కృష్ణ చెప్పినట్టు చేస్తే తను సారథిని ప్రేమించడం అబద్ధం అవుతుంది.

రైలు కూత వేసింది. స్టేషను మాస్టరు పచ్చజెండా ఊపుతున్నాడు. అరవిందకి ప్రేమపైన నమ్మకం పోయిం దెప్పుడో. ప్రేమపట్ల తనకున్న నమ్మకాన్ని సారథి తలపులతోటే సమాధి చేసేసింది.

"అరవిందా! ప్లీజ్ త్వరగా చెప్పు. ఈ రైలుతోపాటుగా నాతో నిన్ను తీసుకువెళ్ళే అవకాశాన్నివ్వు. జీవితాలు మారడానికీ, మలుపులు తిరగడానికీ ఎంతో కాలం పట్టదు అరవిందా. ఒక్క క్షణం చాలు. నువు తీసుకునే నిర్ణయం నీ జీవితాన్ని శాసిస్తుంది."

"..........."

"రవీ!"

కృష్ణ అరవిందకేసి చూశాడు.

ఆ చూపులో కంగారు ఉంది ఆశ ఉంది.

అరవింద తలెత్తి అతనికేసి చూసింది ఆ చూపులో ఆశ్చర్యంఉంది. సంతోషం ఉంది. మెరుపులున్నాయి. తళుకులు ఉన్నాయి.

అరవిందకి కృష్ణ చేయి అందించాడు. ఆ చేతిని ఆసరాగా తీసుకొని కదులుతున్న రైలు ఎక్కింది అరవింద.

"నేను చాలా అదృష్టవంతుణ్ని రవీ!" అన్నాడు కృష్ణ.

అదృష్టం నీదికాదు. నాది. నిన్నెప్పుడో మరచిపోయాను కానీ చీకటిలో చిక్కుకున్న నా జీవితానికి వెలుగు నివ్వడానికీ, ఆదుకోడానికీ ఎదురు చూడకపోయినా ఎదురొచ్చిన దేవుడివి నువ్వు!" అంది అరవింద.

కృష్ణ చేతిలో అరవింద చేయి బిగుసుకొంది.

రైలు వేగాన్ని అందుకొంది.

